క్లుప్తంగా

తెరుచుకున్న దుకాణాలు



తెరుచుకున్న షాపులు, రోడ్లపైకి వచ్చిన గ్రామస్తులు

గుర్ల: మండల కేంద్రంలో డయేరియా నేపథ్యంలో వారం రోజులుగా మూతపడిన దుకాణాలు బుధవారం తెరచుకున్నాయి. గ్రామంలో డయేరియాతో పలువురు మృతి చెందడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ముందస్తు జాగ్రత్తగా ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కిరాణా, పండ్లు, టిఫిన్ షాపులను పూర్తిగా మూసివేశారు. వారం రోజుల పాటు ప్రజలు రోడ్లపైకి రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రస్తుతం డయేరియా కేసులు తగ్గుముఖం పట్టడంతో షాపులు ఒక్కొక్కటిగా తెరచుకుంటున్నాయి.

57 మందికి ఆరోగ్య తనిఖీలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట–2 గ్రామ సచివాలయం పరిధిలో 104 ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు సాయికృష్ణారెడ్డి శిబిరంలో పాల్గొన్న 57 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి దీర్ఘకాలిక రోగులకు వైద్య సేవలందించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు



లొట్లపల్లిలో నిర్వహిస్తున్న గ్రామసభ

జామి: భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణలత అన్నారు. మండలంలోని లొట్లపల్లి లో బుధవారం గ్రామసభ నిర్వహించారు. రీసర్వే అనంతరం 1బీలు సక్రమంగా లేకపోయిన, ఖాతా నంబర్లు తప్పుగా నమోదైన, ఎటువంటి రెవెన్యూ పరమైన సమస్యలు ఉన్న గ్రామసభల్లో రైతులు వినతులు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, సర్వే డీటీ అర్జున్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంతిమయాత్ర రథం ప్రారంభం



అంతిమయాత్ర రథాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ శ్రీను, గోపి, తదితరులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలో సహాయ్ సంస్థ అంతిమయాత్ర రథంను సమకూర్చింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు, జడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఎస్ఎంఎస్ ఫెర్రోఎల్లాయిస్ యూనిట్ హెడ్ వాకాడ గోపి బ్రదర్స్ ఈ రథాన్ని సమకూర్చారు. మృతదేహాన్ని భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్సును కూడా సమకూరుస్తామన్నారు. ఫేకర్ సెక్యూరిటీ ఇన్‌చార్జ్ రామకృష్ణ, మాజీ రెక్టార్ కమలాకర రావు, సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ బమ్మిడి కార్తీక్, శివుకు కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో పాము కలకలం



సచివాలయంలోని మరుగుదొడ్డిలో చేరిన పాము

బొండపల్లి: బొండపల్లి–1 సచివాలయంలో బుధవారం భారీ పాము కలకలం సృష్టించింది. కార్యాలయంలోకి ప్రవేశించిన పామును చూసి ఉద్యోగులు బయటకు పరుగులుతీశారు. స్థానిక సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి యశోద గ్రీన్ అంబాసిడర్ల సాయంతో పాములు చాకచక్యంగా బయటకు తరిమేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఓటు హక్కుపై అవగాహన

శృంగవరపుకోట: యువత ఓటరుగా పేరు నమోదు చేసుకొని ప్రజాస్వామ్య పాలనలో భాగస్వాములు కావా లని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సునీత కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ఎస్ఆర్–2025 ఎస్‌వీఈఈపీ యాక్టివిటీ లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1.1.2025 నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారుని ఓటర్లుగా, 1.1.2025 నాటికి 17 ఏళ్లు నిండిన వారికి ప్రోస్పెక్టివ్ ఓటర్లుగా నమోదుకు ఎన్నికల కమిషన్ ఆదేశించినట్టు చెప్పారు. ప్రోస్పెక్టివ్ ఓటర్లుగా నమోదైన వారికి ఏడాది తర్వాత ఈసీ ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేస్తుందన్నారు. యువత ఓటరు హెల్ప్‌లైన్ యాప్, నేషనల్ ఓటరు సర్వీస్ పోర్టల్ (ఎన్.వి.ఎస్.పి) ద్వారా ఆన్‌లైన్‌లో, స్థానిక బీఎల్‌ఓలు, లేదా తహసీల్దార్ కార్యాలయాల్లో ఫారం–6 సమర్పించి ఓటరులగా నమోదు కావాలని కోరారు.

లోఓల్టేజీ సమస్య తీరేదెన్నడో..?



సోమలింగాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుకు గురైన పీటీఆర్ పరికరం

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు లోఓల్టేజీ సమస్య పట్టిపీడిస్తోంది. లోఓల్టేజీ కారణంగా విద్యుత్ ఉపకరణాలు పనిచేయకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యవసాయ పంపుసెట్లు పనిచేయకపోవడంతో పంటలకు నీటి తడులు అందించలేకపోతున్నారు. ఓల్టేజీలో హెచ్చుతగ్గుల కారణంగా టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పాడవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. లోఓల్టేజీ సమస్యపై ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు విద్యుత్‌శాఖ ఏఈ రమేష్‌ను ప్రశ్నించారు. సబ్ స్టేషన్‌లో ఉన్న పీటీఆర్ మరమ్మతులకు గురికావడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతోందని, దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక అందించామని, కొత్తది మంజూరైన వెంటనే ఈ సమస్య పరిష్కరించడం జరుగుతుందని ఏఈ సమాధానం ఇచ్చారు. పది రోజులైనా ఇంతవరకు కొత్త పీటీఆర్ ఏర్పాటు చేయకపోవడం, లోఓల్టేజీ సమస్యను పరిష్కరించకపోవడంపై మండల పరిషత్ సభ్యులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి కొత్త పీటీఆర్‌ను ఏర్పాటు చేసి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారుల నుంచి స్పందన కరువు



సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న చాలా గ్రామాల ప్రజలు సుమారు నెలరోజుల నుంచి లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. సమస్యను విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారి నుంచి ఇంతవరకు ఎలాంటి స్పందన లేదు. ఇళ్లలో వాడే విద్యుత్ ఉపకరణాలు, వ్యవసాయ పంపుసెట్లు పనిచేయకపోవడంతో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. లోఓల్టేజీ కారణంగా పలు వ్యాపారాలు సాగని పరిస్థితి నెలకొంది.

– ఎస్.సీతారామరాజు, ఎంపీటీసీ, సోమలింగాపురం, మెరకముడిదాం మండలం

పంట తెగుళ్లను సకాలంలో గుర్తించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయ

జామి: పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లను రైతులు సకాలంలో గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా పంటను కాపాడుకోవచ్చని కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీఏ ఎల్.విజయ అన్నారు. మండల కేంద్రమైన జామిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఏ తెగులుకు ఏ మందు పిచికారీ చేయాలో వివరించారు. అనంతరం క్షేత్రపర్యటన చేసి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జామి: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ చంద్రశేఖర్



గుర్ల: కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని శ్రావణిని అభినందిస్తున్న హెచ్ఎం గౌరీదేవి, పీఈటీ లక్ష్మణ్




మెరకముడిదాం: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం సత్యనారాయణ, పీడీ

జామి: రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో, యోగా పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో జామి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్–14 విభాగంలో జగన్‌మోహన్, అండర్–17 విభాగంలో బొట్ట నిఖిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీడీలు చంద్రశేఖర్, ఎర్నమ్మ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం రెహమాన్, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

- **గుర్ల:** మండలంలోని గరికివలస హైస్కూల్ విద్యార్థులు ఎస్.లక్ష్మీప్రసన్న, ఎస్.పూజిత రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ బి.మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. వీరు ఈ నెల 25న చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అలాగే చింతలపేట హైస్కూల్‌కు చెందిన జమ్ము శ్రావణి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు పీడీ లక్ష్మణ్ చెప్పారు. వచ్చే నెల 8,9,10 తేదీల్లో బాపట్లలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుందని తెలిపారు. ఎంపికై న విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

- **మెరకముడిదాం:** మండలంలోని బిళ్లలవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల పార్వతీపురం బాయ్స్ హైస్కూల్‌లో అండర్–17 యోగా పోటీల్లో పంట్ల వాగ్దేవి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విజయనగరం విజ్జీ స్టేడియంలో జరిగిన అండర్–14 త్రోబాల్ పోటీల్లో అంపోలు జోసెఫ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అదేవిధంగా మన్నెపూరి సిద్ధార్థనాయుడు అండర్–17 జిలాస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. వారిని పాఠశాల హెచ్ఎం బోను సత్యనారాయణ, పీఈటీ పి.వెంకటరమణరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నట్టల నివారణతో జీవాలు ఆరోగ్యం



గొర్రెకు నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీ కృష్ణ

గంట్యాడ: గొర్రెలలో నట్టలు నివారిస్తే ఆరోగ్యంగా ఉంటాయని పశుసంవర్ధకశాఖ ఏడీ రెడ్డి కృష్ణ అన్నారు. మండలంలోని పెనసాం గ్రామంలో బుధవారం నిర్వహించిన నట్టల నివారణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. నట్టలు నివారించడం వల్ల గొర్రె పిల్లలు బాగా పెరుగుతాయని తెలిపారు. ఇంతవరకు 43,500 జీవాలకు నట్టల నివారణ మందులు వేసినట్లు చెప్పారు.

తుఫాన్‌పై అప్రమత్తం

గంట్యాడ: తుఫాన్ నేపథ్యంలో పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ రెడ్డి కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధ, గురు, శుక్రవారాల్లో తుఫాన్ వచ్చే అవకాశం ఉన్నందున పాడిరైతులు తమ పశువులను విద్యుత్ స్తంభాలకు కట్టొద్దని సూచించారు. గాలులకు విద్యుత్ వైర్లు తెగి పశువులపై పడి ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా చెట్ల కింద, లోతట్టు ప్రాంతాల్లో పశువులను కట్టరాదని సూచించారు. 6 నెలలు ఉన్న లేగదూడలకు చల్లగాలి తగలకుండా చూసుకోవాలన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే సహించేది లేదు



మంచినీటి ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బి.కళ్యాణి

గజపతినగరం: ఎక్కడపడితే అక్కడ చెత్త, వ్యర్థాలను డంప్ చేస్తే సహించేది లేదని ఎంపీడీఓ బి.కళ్యాణి హెచ్చరించారు. గజపతినగరం–2 గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం సమీపంలో డంప్ చేసిన చెత్తకుప్పలను చూసి ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను సచివాలయ సమీపంలో డంప్ చేస్తుంటే మీరంగా ఏం చేస్తున్నారని సిబ్బందిపై మండిపడ్డారు. చెత్తను డంప్ చేసేవారికి నోటీసులు అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం పరిసరాలను పరిశీలించారు. ట్యాంకు చుట్టూ శుభ్రం చేయాలని సూచించారు.

గ్రామసభకు 34 అర్జీలు



మాట్లాడుతున్న తహసీల్దారు రాములమ్మ

వేపాడ: మండలంలో బల్లంకి రెవెన్యూ గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో 34 అర్జీలు అందినట్లు తహసీల్దారు జె.రాములమ్మ తెలిపారు. భూముల రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు తమ సమస్యలపై గ్రామసభల్లో వినతులు అందించాలని కోరారు. జాయింట్ ఎల్‌పీఎంఎస్‌కు సంబంధించి 13, మ్యుటేషన్‌కు సంబంధించి 16, విస్తీర్ణం పరిశీలనకు 1, పట్టాదారు వివరాల సవరణకు 4 అర్జీలు అందినట్లు చెప్పారు.

ఫైనాన్స్ కంపెనీ తీరుపై ధ్వజం

శృంగవరపుకోట: పట్టణంలోని ఫుల్లర్టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ తీరుపై స్థానిక సీపీఎం నేతలు ధ్వజ మెత్తారు. ఎటువంటి ష్యూరిటీ లేకుండా రుణాలు ఇస్తామని మధ్యతరగతి ప్రజలను మభ్యపెట్టి, అనంతరం వారిని ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. పట్టణానికి చెందిన వెంకటరమణ 2019లో బైక్ కోసం ఫైనాన్స్ తీసుకున్నాడు. సదరు వ్యక్తి 2022 నాటికి రుణం పూర్తిగా చెల్లించినా ఫైనాన్స్ క్లియరెన్స్ పత్రం(ఎన్‌ఓసీ) ఇవ్వకుండా కంపెనీ ప్రతినిధులను ఇబ్బందులు గురిచేస్తున్నారని వాపోయాడు. సీపీఎం నాయకులతో కలిసి బుధవారం ఫైనాన్స్ కంపెనీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశాడు. దీంతో కంపెనీ బ్రాంచ్ మేనేజర్ స్పందించి వచ్చే నెల 15లోగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

సంక్షిప్తంగా..

ముగిసిన వైద్య శిబిరం

గుర్ల: మండల కేంద్రంలో డయేరియా విజృంభణ నేపథ్యంలో బాధితులకు చికిత్స అందించేందుకు స్థానిక హైస్కూల్‌లో వారం రోజులుగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు చికిత్స అందించారు. ప్రస్తుతం డయేరియా అదుపులోకి రావడంతో బుధవారం వైద్య శిబిరాన్ని ఎత్తివేశారు. బాధితులను గుర్ల పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ (33/11 కేవీ) పరిధిలో ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గొల్జాం, సీతారామపురం, లక్కవరపుకోట, ఖాసాపేట, తలారి, కొట్యాడ, కూర్మవరం, రంగారాయపురం, సంతపేట, వేపాడ మండలం పాటూరు, బొద్దాం, కొత్తబొద్దాం, ముకుందపురం, ఒబలయ్యపాలెం తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్

వేపాడ: మండలంలోని అన్ని పంచాయతీల్లో బుధవారం తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రక్షిత మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేశారు. పాటూరులో చేపట్టిన పారిశుధ్య పనులను మండల నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సూర్యనారాయణ, పంచాయతీ అధికారులు పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

అర్హుల గుర్తింపు

వేపాడ: మండలంలో శింగరాయి గ్రామానికి చెందిన ఎస్సీ రైతులకు పాడిగేదెలు కొనుగోలు చేసేందుకు రాయితీ రుణాలు మంజూరు చేయాలని సామాజిక కార్యకర్త అప్పారావు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధాకుమారిని కోరారు. ఈ మేరకు ఈడీ, ఇతర అధికారులు బుధవారం గ్రామాన్ని సందర్శించారు. రుణాలు పొందేందుకు కాలనీలో ఎంతమంది అర్హులు ఉన్నారో వివరాలు సేకరించారు. వారి జీవనోపాధులపై ఆరా తీశారు.

ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి: ఆర్డీఓ

గంట్యాడ: రక్షిత మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని ఆర్డీఓ దాట్ల కీర్తి ఆదేశించారు. మండలంలోని కొర్లాం గ్రామంలో బుధవారం ఆమె పర్యటించారు. తాగునీటి ట్యాంకులు, పైపులైన్లను పరిశీలించారు. గ్రామాల్లో అపారిశుధ్యం లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ రమణమూర్తి, తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, ఈఓపీఆర్డీ భానోజీరావు ఉన్నారు.

యూనిఫాం దుస్తుల పంపిణీ

శృంగవరపుకోట: మండలంలో ధర్మవరం బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు కళాశాల తెలుగు అధ్యాపకుడు రహీంషేక్‌లాల్ బుధవారం యూనిఫాం పంపిణీ చేశారు. సుమారు రూ.12,000ల ఖర్చుతో కుట్టించిన యూనిఫాంలను హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థినులకు అందచేశారు. మూడేళ్లుగా రహీంషేక్‌లాల్ విద్యార్థినులకు యూనిఫాంలను ఉచితంగా అందజేస్తున్నారు.

మురుగునీటిలో మంచినీటి పైపులైన్

కొత్తవలస: మేజర్ పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో ఉన్న మంచినీటి పైపులైన్లు పూర్తిగా మురుగు కాలువల్లో ఉన్నాయి. దీంతో పైపులైన్ లీకుల వల్ల తాగునీరు కలుషితమవుతోందని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలక ముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

చీడపీడల నివారణపై అవగాహన

వేపాడ: మండలంలో నీలకంఠరాజపురం, వీలుపర్తి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సి.బి.యశ్వంతరావు రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ జ్యోతి, వీఏఏ ప్రసాద్, ప్రకృతి వ్యవసాయం ఎంటీ సన్యాసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

జామి: మండలంలోని పీతలపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జయశ్రీ బుధవారం సందర్శించారు. పాఠశాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యత, మెనూ అమలు, వంటగది, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

జగన్నాథపురంలో జేసీ పర్యటన



అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ సేతుమాధవన్

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేదంటే అనేక రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని జేసీ సేతుమాధవన్ అన్నారు. గరివిడి మండలం రేగటి పంచాయతీ పరిధి జగన్నాథపురం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలని సూచించారు. గ్రామంలో డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకు వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.వి.సత్యవాణి, మండల ప్రత్యేకాధికారి వైవీ రమణ, తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, గ్రామపెద్దలు ఎంపీటీసీ కడుమల రాంబాబు, మాజీ సర్పంచ్ సారిపాక సురేష్, వైద్యాధికారి రాజ్యలక్ష్మీ, సీహెచ్ఓ సత్యంనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి:జేసీ

మెరకముడిదాం: గ్రామాల్లో సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారలను ఆదేశించారు. మండలంలోని చినబంటుపల్లి గ్రామంలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకును బుధవారం ఆయన పరిశీలించారు. గ్రామనికి సమీపంలో ఉన్న గరివిడి మండలం జగన్నాథపురంలో డయేరియా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ జి.భాస్కరరావు, తహసీల్దార్ అజురఫీజాన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీలతకు సూచించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, చీపురుపల్లి ఆర్డీఓ జి.వి.సత్యవాణి ఉన్నారు.

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు తగవు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

గజపతినగరం: మండలంలోని రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న మానాపురం సౌజన్యను రాజకీయ వేధింపులకు గురిచేస్తూ తొలగించాలని చూస్తున్న అధికారుల తీరును ఖండిస్తున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి అన్నారు. పురిటిపెంట సమీపంలో బుధవారం విలేకరులతో సమావేశమై మాట్లాడారు. రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో సౌజన్య రెండేళ్లుగా హెల్పర్‌గా పని చేస్తోందన్నారు. అప్పట్లో ఆమె ధ్రువపత్రాలను పరిశీలించాకే అధికారులు ఆమెకు ఉద్యోగం ఇచ్చారని, కానీ ఇప్పుడు అవి సరైనవి కాదని చెప్పి ఆమెను తొలగించేందుకు ప్రయత్నించడం భావ్యం కాదన్నారు. అధికారులు దీనిపై సమగ్ర విచారణ చేపట్టి ఆమెకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై మంత్రి గుమ్మడి సంధ్యారాణిని, మంత్రి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. ఇప్పటికైనా రాజకీయ వేధింపులు ఆపాలని, లేదంటే న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.పైడిరాజు, జిల్లా గౌరవాధ్యక్షురాలు వి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కెంగువలో డీఎంహెచ్ఓ పర్యటన



కెంగువలో వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

గజపతినగరం: మండలంలోని కెంగువ గ్రామంలో డయేరియా కేసులు నమోదు కావడంతో డీఎంహెచ్ఓ భాస్కరరావు బుధవారం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఇప్పటివరకు 9 మంది డయేరియా బారినపడినట్లు గుర్తించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. గ్రామంలో చేపడుతున్న శానిటేషన్, క్లోరినేషన్ పనులు, తాగునీటి సరఫరాను పరిశీలించారు. ప్రజలకు ట్యాంకర్ల ద్వారా సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. పాడైన పైపులైన్లను బాగుచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్, డీఈ తిరుపతి నాయుడు, ఏఈ శ్రీనివాసరావు, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు సాయికృష్ణారెడ్డి, పుష్పాంజలి, సుష్మ, అనూజ్ రాయ్, గజపతినగరం ఈఓపీఆర్డీ బి.సుగుణాకరరావు, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ఆరా



గుచ్చిమి గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శాంతకుమారి

దత్తిరాజేరు: మండలంలోని గుచ్చిమి, కన్నాం, దాసుపేట గ్రామాల్లో డయేరియా ప్రబలడంతో ఆయా గ్రామాల్లో ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి శాంతకుమారి బుధవారం పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. తాగునీటి సరఫరా, వైద్య శిబిరాలపై గ్రామస్తులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వీధుల్లో, కాలువల వద్ద బ్లీచింగ్ చల్లాలని, తాగునీటి ట్యాంకర్లను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ విజయభాస్కర్, సీడీపీఓ నాగమణి, వైద్యాధికారి ఆనంద్, పంచాయతీ అధికారి వాణిశ్రీ, తదితరులు ఉన్నారు.

బహిరంగ మలవిసర్జనతో రోగాలు



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న

గంట్యాడ: బహిరంగ మలవిసర్జనను అరికట్టడం ద్వారా డయేరియాను నిర్మూలించవచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ కె.ఎర్రన్న అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో డయేరియా, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగ మలవిసర్జన, కలుషిత నీటి కారణంగా డయేరియా వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కాచిచల్లార్చిన నీటిని తాగాలని, జ్వరాలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఏఎన్ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డయేరియా పడగ

- సీహెచ్‌సీలో చేరిన 30 మంది డయేరియా బాధితులు
- ఈ నెల 10 నుంచి 101 కేసుల నమోదు
- ఆందోళనలో ప్రజలు



గరివిడి మండలానికి చెందిన రోగుల పరిస్థితి తెలుసుకుంటున్న నోడల్ అధికారి రమణ

చీపురుపల్లి: డయేరియా మహమ్మారి పడగ విప్పుతోంది. నాలుగైదు రోజుల కిందటే గుర్ల మండల కేంద్రంతోపాటు అదే గ్రామంలోని పలు గ్రామాల్లో విజృంభించిన డయేరియా పది మందిని పొట్టన బెట్టుకున్న సంగతి తెలిసిందే. అప్పటికే నియోజకవర్గంలో ప్రజలు ఉలిక్కపడి భయాందోళనల్లో ఉన్నారు. తాజాగా గరివిడి మండలానికి కూడా డయేరియా విజృంభించడంతో అక్కడ కూడా కేసులు పెరుగుతుండడంతో ప్రజల్లో మరింత భయం పెరుగుతోంది. ఒకటి, రెండు రోజుల్లోనే గరివిడి మండలంలో 20 డయేరియా కేసులు నమోదుకావడంతో ఆందోళన చెందుతున్నారు. గుర్ల, గరివిడి మండలాలకు చెందిన డయేరియా రోగులతో చీపురుపల్లిలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) కిటకిటలాడుతోంది. ప్రస్తుతం 30 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. వీరిలో గరివిడి మండలంలోని దుమ్మేద, కోడూరు, జగన్నాథపురం, దువ్వాం, కందిపేట, శివరాం గ్రామాలకు చెందిన 16 మంది, గుర్ల మండలంలోని నాగల్లవలస, పెనుబర్తి, సదానందపురం, గుర్ల, తెట్టంగి, గూడెం, నాగల్లవలస తదితర గ్రామాలకు చెందిన 14 మంది ఉన్నారు. సీహెచ్‌సీను సందర్శించిన గరివిడి మండల నోడల్ అధికారి, పశుసంవర్ధకశాఖ జేడీ వైవి.రమణ రోగుల వివరాలపై ఆరా తీశారు. ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు స్థానిక సీహెచ్‌సీలో మరికొన్ని బెడ్లు కూడా సిద్ధంచేశారు.

మహిళా ఉద్యోగికి ఆర్థిక సాయం



శ్రీదేవికి ఎఫ్‌డీ పత్రాలను అందజేస్తున్న ఎంఈఓలు కూర్మారావు, శ్రీనివాసరావు, తదితరులు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం(ఎంఈఓ)లో మెసెంజర్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కె.శ్రీదేవికి ఉపాధ్యాయులు రూ.60 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. శ్రీదేవి భర్త నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమెకు ఆర్థికంగా సాయం చేసేందుకు ఉపాధ్యాయులు ముందుకువచ్చారు. ఈమేరకు ఎంఈఓలు సీహెచ్.కూర్మారావు, బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రూ.60 వేలు సేకరించి ఆమె పేరున పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సంబంధిత పత్రాలను ఎంఈఓలు శ్రీదేవికి అందజేశారు.